రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక

దండెపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్‌ఫెడరేషన్ అండర్‌14రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు మదర్ థెరిసా పాఠశాల 6వతరగతి విద్యార్థిని జి. మాన్యజ ఎంపికైంది. ఈ నెల 16నుంచి 18వరకు హైదరాబాదులో జరిగే రాష్ట్రపోటీల్లో మాన్యజ పాల్గొంటుంది. ప్రిన్సిపాల్ అనూప్ జార్జ్, మేనేజర్ షైన్, కరస్పాండెంట్ లింటో, పీఈటీలు సుద్దాల దీపిక, గారె పవన్, స్కూల్ టీచర్లు అభినందించారు.



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, పీఈటీ

మూగజీవాలకు తప్పనిగోస

● మేతకు వెళ్లాలంటే మోకాలి లోతు బురద దాటాల్సిందే..



మోకాలి లోతు బురదలో వెళ్తున్న పశువులు

కోటపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఏదైనాసమస్య ఎదురైనప్పుడు, తమ డిమాండ్లు నెరవేరనప్పుడు ప్రజలైతే ధర్నాలు, రాస్తారోకోలో, ఆందోళనలు నిర్వహించి పరిష్కరించుకుంటారు. కానీ ఈ మూగజీవాలు ప్రశ్నించలేవనే భావనతోనే వాటి బాధలు ఎవరు పట్టించుకోవడం లేదు. మండలంలోని ఎడగట్ట గ్రామంలోని మూగ జీవాలకు ఎదురవుతున్న దుస్థితి ఇది. ఈ గ్రామంలోని పంట పొలాల వైపు, స్థానిక అటవీప్రాంతం వైపు వెళ్లేందుకు రహదారి లేదు. ఉన్న దారి మొత్తం మట్టిది కావడంతో వర్షాకాలంలో బురదమయంగా మారింది. ఈ దారి గుండా పశువులు, ఆవులమందలు మేతకు వెళ్లేందుకు ఇబ్బందుల పాలవుతున్నాయి. మోకాలిలోతు బురదలో అడుగుతీసి అడుగు వేస్తూ ఆర్తనాదాలు పెడు తూ మేతకు వెళ్లి వస్తున్నాయి. మరోవైపు వ్యవసాయదారులు సైతం పొలాల వైపు వెళ్లా లంటే ఇబ్బందుల పాలవుతున్నారు. దీనిపై ఇటీవల కలెక్టర్‌కు ప్రజావాణిలో తెలిపామని, కలెక్టర్ స్పందించి రోడ్డు మంజూరు చేయించి నిర్మాణం పూర్తి చేస్తే తమ పశువుల కష్టాలు తొలగుతాయని పశువుల యాజమానులు కోరుతున్నారు.

● స్మగ్లర్ల వేటుకు అంతరించిపోతున్న అడవులు
● జిల్లా ఎల్లలు దాటుతున్న టేకు కలప
● ఒక్క తానిమడుగు బీట్‌లోనే వందల చెట్లు నరికివేత
● సీసీ కెమెరాలున్నా ఆగని కలప తరలింపు

తానిమడుగు బీట్‌లో ఇటీవల నరికివేతకు గురైన టేకు వృక్షాలు



అటవీ సంపదకు రక్షణ ఏది..?

మంచిర్యాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అటవీ సంపదకు రక్షణ లేకుండా పోయింది. స్మగ్లర్ల గొడ్డలి వేటుకు అడవులు పూర్తిగా అంతరించిపోతున్నాయి. ఒకప్పటి ఆదిలాబాద్ జిల్లా దట్టమైన అడవులకు పెట్టింది పేరు. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఆయా ప్రభుత్వాల నిర్లక్ష్యం, కొందరు అటవీ అధికారుల పట్టింపులేని తనంతో అత్యంత విలువైన కలప స్మగ్లర్ల గొడ్డలివేటుకు మాయమవుతోంది. అటవీ సంపద రక్షణకు ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా.. ఆశించిన స్థాయిలో ఫలితం ఉండటంలేదు.

అటవీ విస్తీర్ణం ఇలా...

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలో మొత్తం 7,101.30 చదరపు కిలోమీటర్ల మేర అడవులు విస్తరించి ఉన్నాయి. ఆదిలాబాద్ డివిజన్‌లో 1898.95 చదరపు కిలోమీటర్లు, బెల్లంపల్లి డివిజన్‌లో 1524.39, జన్నారం డివిజన్‌లో 643.74, కాగజ్‌నగర్ డివిజన్‌లో 893.29, మంచిర్యాలడివిజన్‌లో 1115.37, నిర్మల్ డివిజన్‌లో 1025.16 చదరపు కిలోమీటర్లలో అడవులు విస్తరించి ఉన్నాయి. ఇక్కడి కలపకు మంచి డిమాండ్ ఉండటం తో స్మగ్లర్ల కన్ను వాటిపై పడి క్రమేపీ అడవులు పలు చబడుతున్నాయి. మంచిర్యాల జిల్లాలో లక్షా 76వేల హెక్టార్లలో అడవులు విస్తరించి ఉండగా, అటవీ అధికారులు వీటిని 195 బీట్లుగా విభజించి సంరక్షిస్తున్నారు. ఇందుకోసం ఏటా కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా...స్మగ్లర్ల ఆగడాలకు అడ్డుకట్ట పడటం లేదు. వన్య సంపద రక్షణ కోసం అడవుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినప్పటికీ అవి నిరుపయోగంగా మారాయి. కేవలం అడవుల్లో ఏ జాతికి చెందినవి ఎన్ని వృక్షాలు ఉన్నాయో లెక్కలు వేసుకోవడానికే అవి ఉపయోగపడుతున్నట్లు ఉన్నాయి.

ఎల్లలు దాటుతున్న కలప...

జిల్లాలోని తాళ్లపేట రేంజ్ పరిధిలో లభించే టేకు కలపకు మంచి ఆధరణ ఉంది. నాణ్యమైన కలప కావడంతో అక్కడి కర్రతో గృహ అవసరాలు, ఇతర ఫర్నీచర్ చేయించుకునేందుకు ప్రజలు ఉత్సాహం కనబరు స్తుంటారు. దీంతో స్మగ్లర్ల కళ్లు ఈ ప్రాంతంపై పడుతుంటాయి. అదును చూసుకొని విలువైన టేకు చెట్లను నరికివేస్తూ గట్టు చప్పుడు కాకుండా తమ పని కాని స్తుంటారు. స్మగ్లర్లకు కొందరు అటవీ అధికారుల అండదండలు కూడా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. వారి అండదండలతోనే కలప అటవీ ప్రాంతం దాటుతుం డగా, జిల్లా ఎల్లలు దాటి ఇతర ప్రాంతాలకు తరలిపో తోంది. నిత్యం నిఘా ఉంచాల్సిన సిబ్బంది, కిందిస్థాయి అధికారుల నిర్లక్ష్యం కారణంగానే అటవీ సంపద కరిగి పోతోందన్న విమర్శలు ఉన్నాయి.

వందల సంఖ్యలో టేకు చెట్లు నరికివేత...

ఇటీవలి కాలంలో వందల సంఖ్యలో టేకు చెట్టు స్మగ్మర్ల దాహానికి నేలకొరిగాయి. అటవీశాఖ తాళ్లపేట రేంజ్ పరిధి తానిమడుగు బీట్‌లోని 394వ కంపార్ట్‌మెం ట్‌లో ఇటీవల స్మగ్లర్లు పెద్ద మొత్తంలో టేకు చెట్లను నరికివేశారు. దసరా పండుగ తరువాత దాదాపు 50 టే కు చెట్లను (తరువాయి 5లో)

ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావుకు సీఎం పరామర్శ



ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావును పరామర్శిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

మంచిర్యాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం పరామర్శించారు. గతకొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ప్రేంసాగర్‌రావు హైద్రాబాద్ గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సమాచారం తెలు సుకున్న సీఎం రేవంత్‌రెడ్డి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలిసి ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న ప్రేంసాగర్‌రావు సతీమణి, డీసీసీ అధ్యక్షురాలు సురేఖతోపాటు వైద్యులతో మాట్లాడిన సీఎం, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలి

● కలెక్టర్ కుమార్ దీపక్



చెన్నూరులో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

చెన్నూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) జిల్లాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. కిష్టంపేటలో చేపట్టిన డిగ్రీ కళాశాల అదనపు గదుల నిర్మాణాన్ని ఎంపీడీవో మోహన్‌తో కలిసి గురువారం పరిశీలించారు. పనుల్లో నాణ్యమైన సిమెంట్, ఇసుక వాడాలని సూచించారు. ఆశ్రమ బాలుర పాఠశాల, సంక్షేమ వసతి గృహాన్ని సందర్శించి అక్కడి పనులను మున్సిపల్ కమిషనర్ మురళికృష్ణతో కలిసి పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం అన్నివిధాల చర్యలు చేపడుతుందన్నారు. ఇందులో భాగంగా పాఠశాలల్లో విద్యుత్‌సౌకర్యం, మూత్ర శాలలు, భోజనశాలల నిర్మాణం చేపడుతుందన్నారు. ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు అమృత్ 2.0 పథకం ద్వారా నీటి ట్యాంకులు నిర్మించి తాగు నీరు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం పీహెచ్‌సీ భవన నిర్మాణం పనులను పరిశీలించారు. కలెక్టర్ వెంట స్థానిక అధికారులు పాల్గొన్నారు.

'గూడెం జీపీకి ఎన్నికలు నిర్వహించండి'



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గూడెం గ్రామస్తులు

దండెపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : గూడెం గ్రామ పంచాయతిని ఏజెన్సీ నుంచి తొలగించి ఎన్నికలు నిర్వహించాలని అక్కడి ప్రజలు కోరారు. గూడెం పంచాయతీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన గ్రామ సభలో తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాం డేకు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. 35 ఏళ్లగా ఎన్నికలు లేక గ్రామం అబివృద్ధి చెందడం లేదన్నారు. కోర్టు ఆదేశాలతో ప్రస్తుతం పంచాయతి ఎన్నికలు జరిగే అవకాశం లేనందున మరోసారి సర్వే చేపట్టి 1-70 చట్టాన్ని తొలగించాలని కోరారు.

గ్రామంలో ఒక్క గిరిజనుడు కూడా లేనందున ఏజెన్సీ నుంచి తొలగించాలని విన్నవించుకున్నారు. ఈ మేరకు గ్రామస్తులు ఏకగ్రీవంగా తీర్మానం చేసి, తహసీల్దార్‌కు అంద జేశారు. గ్రామ శివారు ప్రభుత్వ భూమిలో మొరం, బండ తవ్వకాలు నిలిపి వేయాలని తహసీల్దార్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

నిందితులను ఇంకెప్పుడు అరెస్టు చేస్తారు..

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్ గౌడ్

చెన్నూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) వేమనపల్లి బీజేపీ మండల అధ్యక్షుడు ఏట మధూకర్ ఆత్మ హత్యకు కారుకులైన నిందితులను ఇంకెప్పుడు అరెస్టు చేస్తారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ ప్రశ్నించారు. చెన్నూరులో గురువారం నిర్వహించిన విలేకరులు సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీసుల నిర్లక్ష్యం వల్లే నిందితులు స్వేచ్ఛగా తిరుతున్నారన్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు కాబట్టే నిందితులపై ఇప్పటికి ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. నీల్వాయి ఎస్సై కోటేశ్వర్ రావు నిందితుల్లో ఒకరికి చుట్టం కావడం వల్లే కేసును నీరుగార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. సంఘటన సరిగి వారం రోజులు దాటినప్పటికి ఏ ఒక్క నిందితుడిని అదులోకి తీసుకోక పోవడానికి గల కారణాన్ని పోలీసులు చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్ర హోం సహాయ మంత్రి బండి సంజయ్, రాష్ట్ర పార్టీ అధ్యక్షులు రాంచంద్రరావులు బాదిత కుటుంబాన్ని పరామర్శించి నిందితులనె వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేసినప్పటికి పోలీసుల్లో కదలికరావడం లేదన్నారు. రాష్ట్ర ఉపాధ్యకరక్షులు రఘు నాథరావు జిల్లాకు వచ్చిన అనంతరం తదుపరి కార్యచరణ ప్రకటిస్తామన్నారు. ఆయన వెంట స్థానిక నాయకులు ఉన్నారు.



మాట్లాడుతున్న వెంటేశ్వర్‌గౌడ్

సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం

జైపూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) సీపీఆర్ వారోత్సవాల సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో గురువారం సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్య క్రమాన్ని వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించగా హఠాత్తుగా గుండె ఆగిపోవడం, లేదా శ్వాస ఆగిపోవడం వంటి అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను రక్షించడంలో సీపీఆర్ ఎంతో ముఖ్యమో వివరించారు. జైపూర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ముస్తాఫా ఆధ్వర్యంలో 108 ఎమర్జెన్సీ సిబ్బందితో కలిసి సీపీఆర్ పద్దతులను ప్రాక్టికల్‌గా చూయించారు. ఛాతిపై సరైన ఒత్తిడి, శ్వాస నింపే విధానం వంటి దశలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వనజా రెడ్డి, ఎంపీడీవో సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రాథమిక జీవ రక్షణ పద్దతులను నేర్చుకోవడం ద్వారా అత్యవసర సమయంలో ప్రాణాలను కాపాడగలరని పేర్కొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు ఇలాంటి శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్య క్రమంలో 108 సిబ్బంది లక్ష్మణ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

బెల్లంపల్లి, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని సబ్‌కలెక్టర్ మనోజ్, జిల్లా సంక్షేమ అధికారి రవూఫ్ అన్నారు. గురువారం తాళ్లగురిజాల రైతు వేదికలో పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు పండ్లు, పోషకాహారం పంపిణీ చేసి మాట్లాడారు. గర్భి ణులు, చిన్నారులు, మహిళలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం పోషణమాస మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. గర్భిణులు, చిన్నారులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారాలు అందిస్తున్నారని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే గర్భిణులు ఆహార విషయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తల్లిపాలు బిడ్డ ఎదుగుదలకు ఎంతో శ్రేయస్కరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీవో స్వరూపరాణి, సూపర్‌వైజర్ పోషన అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ రజిత, తాళ్లగురిజాల పీహెచ్‌సీ వైద్యురాలు ఇవాంజలీన, వుమెన్ హబ్ జిల్లా కోఆర్డినే టర్ సౌజన్య, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు పోషకహారం అందజేస్తున్న సబ్ కలెక్టర్, జిల్లా సంక్షేమ అధికారి

బాధితులకు భరోసా కల్పించాలి

● ప్రజలకు అందుబాటులో ఉండి విధులు నిర్వహించాలి ● పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

హాజీపూర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : ప్రజలు అందించే ఫిర్యాదులపై అధికారులు తక్షణమే స్పందించి బాధితులకు భరోసా కల్పించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంచిర్యాల జోన్ హాజీపూర్ పోలీస్‌స్టేషన్‌ను గురువారం తనిఖీ చేశారు. తనిఖీలకై పోలీస్‌స్టేషన్ చేరుకున్న పోలీస్‌కమిషనర్‌కు అధికారులు పూలమొక్కలను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం కమిషనర్ పోలీస్ సిబ్బందితో మాట్లాడి వారి విధులు, పనితీరు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈ తనిఖీల్లో భాగంగా సీపీ పోలీస్‌స్టేషన్ రిసెప్షన్, సీసీటీఎన్ఎస్ విభాగాల పనితీరును సంబంధిత పోలీస్ సిబ్బందిని శాఖపరమైన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన పలు రికార్డులను తనిఖీ చేయడంతో పాటు, పెండింగ్ కేసులు, కోర్టు కేసులు, ప్రస్తుతం దర్యాప్తులో వున్న కేసులకు సంబంధించి పోలీస్ కమిషనర్ తనిఖీ చేసి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. రౌడీషీటర్లు, అనుమానితులు, కేడీ, డీసీలు, మిస్సింగ్, ప్రాపర్టీ నేరాలకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా సీపీ మాట్లాడుతూ విజబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ నిర్వహించాలి గ్రామాలను సందర్శించి ప్రజలతో మమేకమై ప్రజల్లో నమ్మకాన్ని కలిగించడంతో పాటు, పోలీస్ వ్యవస్థపట్ల ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించాలన్నారు. ప్రతి పోలీస్ ఉద్యోగి నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వహించా లన్నారు. ప్రజల సమస్యలకు తక్షణ స్పందనతోపాటు, మర్యాద పూర్వకంగా వారి సమస్య వినాల్సిన బాధ్యత అందరిపై ఉంద న్నారు. రోడ్డు ప్రమాదాలు నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకో వాలని సూచించారు. తనిఖీల అనంతరం పోలీస్‌కమిషనర్ చేతుల మీదుగా పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. ఈ తనిఖీల్లో మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్, ఏసీపీ ప్రకాష్, మంచిర్యాలరూరల్ సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐ స్వరూప్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.



పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్క నాటుతున్న సీపీ

పద్మల్‌పూరి కాకో ఆలయంలో ఆదివాసీల జాతర

● అమ్మవారికి సాంప్రదాయబద్ధంగా పూజలు
● గుస్సాడి నృత్యాలతో సందడి

దండపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిరేవులో పద్మల్‌పూరి కాకో ఆలయానికి ఆదివాసీలు తరలివచ్చి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నలుమూలల నుంచి గురువారం వేలాది మంది కుటుంబ సమేతంగా చేరుకొని అమ్మవారిని దర్శించుకున్నారు. దీపావళి పండుగ ముగిసే వరకు సంప్రదాయ బద్ధంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తారు. గిరిజనులు గోదావరి నదిలో పున్యస్నానాలు ఆచరించి గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మ వారికి జలాభిషేకం చేసేందుకు గిరిజనులు డప్పువాయిద్యాలతో గుస్సాడి వేషధారణలో నృత్యాలతో ఆలయానికి చేరుకున్నారు. అనంతరం ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి జలా భిషేకం చేశారు. మరుసటి తెల్లారి గోదావరిలో పున్యస్నానాలు ఆచరించి అనంతరం కాకో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వారివారి స్వగ్రామాలకు బయలుదేరుతారు. రా త్రంతా భజన పాటలతో జాగారం చేసి కాకో అమ్మవారిని కొలుస్తారు. దీంతో ఆలయం ఆలయం వద్ద గిరిజనులతో సందడి నెలకొంది.



కాకో అమ్మవారిని దర్శించుకుంటున్న ఆదివాసీలు

భార్యపై కోపంతో అత్త ఇంటికి నిప్పు

లింగాపూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): లింగాపూర్ మండలంలోని ఎల్లాపటార్ గ్రామంలో గురువారం భార్యపై కోపంతో ఓ భర్త అత్త ఇంటికి నిప్పుపెట్టాడు. ఈ ప్రమాదంలో పెంకుటిల్లుతో పాటు సామగ్రి కాలిపోయింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లాపటార్ గ్రామానికి చెందిన అబ్బాల్‌బి భర్త కొంతకాలం క్రితం మృతి చెందాడు. ఆమె తన కూతురును జైనూర్ మండలానికి చెందిన ముజాయిజ్ బేగ్ అనే వ్యక్తికి ఇచ్చి తొమ్మిది నెలల క్రితం వివాహం చేసింది. అల్లుడు రోజు మద్యం తాగి వచ్చి బిడ్డను కొడుతుండంతో 15 రోజుల క్రితం ఆమె కూతురిని పుట్టింటికి తీసుకొచ్చింది. భార్యపై కోపంతో ఉన్న ముజాయిజ్ బేగ్ గురువారం మధ్యాహ్నం మద్యం తాగి ఎల్లాపటార్ వచ్చాడు. అత్త ఇంటికి వెళ్లి కత్తితో తల్లీకూతుళ్లపై దాడి చేశాడు. వారు భయంతో ఇంట్లో నుంచి వెళ్లి పోయారు. అనంతరం ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్‌ను లీక్ చేసి నిప్పు అంటించాడు. మంటలు అంటుకుని ఇంటి కప్పుతో పాటు సామగ్రి కాలిపోయింది. బాధిత కుటుంబానికి సుమారు రూ. 2లక్షల మేర నష్టం వాటిల్లిందని స్థానికులు తెలిపారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

లక్షెట్టిపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట మండలం ఎల్లారం గ్రామానికి చెందిన వావిలాల రమేశ్(39) అనే యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై సురేష్ గురువారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం రమేశ్ లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతిగా మద్యానికి అలవాటు పడ్డాడు. ఇంట్లో కుటుంబ సభ్యులు ఎంత చెప్పినా మద్యం మానలేదు. ఈనెల 14న మంచిర్యాలలో లారీ అసోసి యేషన్ మీటింగ్‌కు వెళ్లి ఇంటికి తిరగి వచ్చాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో మద్యం మత్తులో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రమేశ్‌కు భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్య రజిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

మందమర్రి టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామకృష్ణపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని క్రైస్ట్ పాఠశాల వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బీమా సుధాకర్ (65) మృతిచెందాడు. స్థానిక ఎస్సై రాజశేఖర్ కథనం ప్రకారం సుధాకర్ తన ఇంటి సమీపంలోని కిరాణం షాపు వద్దకు ద్విచక్ర వాహనంపై వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నాడు. అదే సమయంలో బెల్లంపల్లి నుంచి మంచిర్యాలకు వెళ్లే ఆటో వేగంగా వచ్చి ఢీ కొట్టడంతో సుధాకర్ కింద పడిపోయాడు. అనంతరం కుటుంబీకులు మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని పేర్కొన్నారు. ఆటో డ్రైవర్ అజాగ్రత్తగా నడుపుతూ ఢీ కొట్టాడని ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

ఇద్దరి బైండోవర్

జన్నారం, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): కవ్వాల్‌టైగర్‌జోన్‌లోని జన్నారం రేంజ్‌లో గల జువ్వి గూడ అటవి ప్రాంతంలో అక్రమంగా చెట్లు నరికిన జాదవ్ సుదం, జాదవ్ దేవిదాసులను తహసీల్దార్ కార్యాలయంలో బైండోవర్ చేసినట్లు అటవి అధికారులు లాలు బాయ్ తెలిపారు. ఎవరైన అక్రమంగా కలప రవాణ చేసిన చెట్లు నరికిన చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు.

గర్భిణులకు పోషకాహారం అందించాలి



మాట్లాడుతున్న సీడీపీవో విజయలక్ష్మి

పెంచికలపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించాలని సీడీపీవో విజయలక్ష్మి అన్నారు. పెంచికలపేట అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పాలు, కోడిగుడ్లు, బియ్యం, పప్పు, ఆకు కూరలు భోజనాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నా రు. కిశోర బాలికలు పల్లిప్టీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హులందరికి అంగన్‌వాడీ సేవలను అందజేయాలని టీచర్లకు సూచించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేసే పోషకాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీడీపీవో హేమలత, సూపర్‌వైజర్లు హసీనా, కరుణరెడ్డి, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

కట్టలపై విత్తి.. సాగుకు సం'పత్తి'

- ఏజెన్సీ మండలాల్లో రైతుల వినూత్న ఆలోచన
- నీరు నిలిచి పంట దెబ్బతినకుండా చర్యలు



జైనూర్/సిర్పూర్(యు)/లింగాపూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): భూమిని కట్టలుగా మార్చి పత్తి పంటను సాగుచేయడం ద్వారా మంచి పంట దిగుబడి సాధించవచ్చని అధికారుల సూచన మేరకు రైతులు ఆదిశగా చర్యలు తీసుకుంటున్నారు. లోతట్టు ప్రాంతా నీరు నిలిచి ఉండడంతో పంటల పెరుగుదల ఆగి పోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. కానీ ఏజెన్సీ మండలాల్లోని పలువురు రైతులు వ్యవసాయ అధికారుల సూచనలతో సాగుకు ముందు నుంచే వినూత్నంగా ఆలోచించి పత్తి పంట పండిస్తున్నారు. ప్రస్తుతం వర్షాలకు నీరు నిలువఉన్నా తమ పంటలకు ఇబ్బంది ఉం డడం లేదని, బాగా ఎదుగుతున్నాయని చెబుతున్నారు.

- జాగ్రత్తలు ఇలా..

విత్తేసమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు చెబుతున్నారు. నల్లరేగడి నెలల్లో పత్తి విత్తడానికి ముందు 2 నుంచి 4అడుగుల దూరంలో మట్టితో కట్టలుగా నేలను తయారు చేసుకోవాలి. ఇలా ఏర్పాటు చేసిన కట్టలకు మధ్యలో నీరు నిల్వ ఉండకుండా ఒక కాలువలా ఉండేలా చూసుకోవాలి. అనంతరం విత్తనాలుపెట్టే క్రమంలో కట్టపైన మాత్రమే విత్తాలి. ఈ విధంగా విత్తడంతో మొక్క ఎత్తుగా ఉండడంతో నీరునిల్వ ఉండకుండా ముందుకు పారుతుంది. ఒకవేళ నీరునిల్వ ఉన్నా విత్తనం కట్టపై ఉండడంతో ఇబ్బంది ఉండదు. సాధారణంగా చాలా మంది రైతులు ఇలా చేయరు. నేలపైనే విత్తుకుంటారు. దీని వల్ల నీరు నిల్వ ఉంటే ప్రదేశాల్లో పంట దెబ్బతినే అవకాశం ఉంటుంది.

- 4.10 లక్షల ఎకరాల్లో పంటలు

ఈ వానాకాలం సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా సుమారు 4.10లక్షల ఎకరాల్లో వివిధరకాల పంటలను సాగు చేస్తున్నారు. జిల్లాలో ప్రధానంగా పత్తి పంట 3.35లక్షల ఎకరాల్లో సాగవుతోందని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఈ పంటకు ప్రధానంగా నల్ల రేగడి భూములు అనుకూలం. కానీ వరుసగా కురుస్తున్న అధిక వర్షాలతో ఈ భూముల్లో నీరు నిలువ ఉండే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అధికనీరు నిలువ కారణంగా పెరుగుదల ఆగి పోతుంది. కాత, పూత దశలో ఉన్న ఈ సమయంలో నిలువ ఉండడం మం చిది కాదు. రోజుల తరబడి ఉంటే మొక్కలు పెరిగి పోయే ప్రమాదం కూడా ఉంది. క్రమంగా రైతన్నలకు ఆశించిన దిగుబడి రాకపోవచ్చు. దిన్ని గుర్తించిన అధికారులు సాగుకు ముందు నుంచే పలువురి వ్యవసాయం క్షేత్రాల్లో మార్పులు తీసుకొచ్చారు. ఈ క్రమంలో కట్టలు కట్టుకుని వాటిపై విత్తనాలు విత్తి పత్తిసాగు చేస్తున్న ఈ రైతు కుడిమెత రమేశ్. జైనూరు మండలంలోని పోచంలొద్దికి చెందిన వాడు. వ్యవసాయ అధి కారుల సూచనల ప్రకారం ఇలా సాగు చేస్తు న్నాడు. అధిక వర్షాలకు చేనులో నీరు నిలువ ఉన్నా.. పంటలకు ఇబ్బంది ఉండదని చెబుతున్నారు. ఈ ఏడాది అధిక దిగుబడి వస్తుం దని భావిస్తున్నాడు.

సరిహద్దుల్లో నిరంతరం నిఘా ఉండాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ కాంతిలాల్ పాటిల్

కౌటాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అంతర్రాష్ట్ర సరిహద్దులు ఉన్న ప్రాంతాల్లో నిఘా నిరంతరం ఉండాలని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. కౌటాల సర్కిల్ పోలీసు కార్యాలయాన్ని గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి కేసులు పెండింగ్‌లో లేకుండా చూడాలని, జరిగిన నేరాలను సర్కిల్ మ్యాప్‌లో స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. గ్రేవ్ కేసులపై నాణ్యమైన దర్యాప్తు చేసి వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. మర్డర్, డౌరీ డెత్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. అవసరమైతే టెక్నికల్ సపోర్టు వినియోగించుకోవాలని సూచించారు. సర్కిల్ పరిధిలో గల పోలీసు స్టేషన్లను తరుచుగా సందర్శిస్తూ ఆయా కేసులపై సంబంధిత ఎస్‌హెచ్‌వోలకు తగిన సూచనలు సలహాలు ఇవ్వాలని అన్నారు. అలాగే సర్కిల్ పరిధిలో ఉన్న కేడీ, సస్పెక్ట్, రౌడీ షీట్స్ తెరిచిన వ్యక్తులను నిరంతరం చెక్ చేస్తూ వారి కదిలికలపై నిఘా ఉంచాలన్నారు. ముఖ్యంగా ఆస్తి సంబంధిత నేరాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను క్రైం హాట్‌స్పాట్‌గా గుర్తించి నిఘాను మరింత బలోపేతం చేయాలని సూచించారు. నేరాల ఛేదనలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ప్రతి స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం కృషి చేయాలని అన్నారు. సర్కిల్ పరిధిలో ఉన్న లాంగ్ పెండింగ్ కేసులు, ఎన్‌బీడబ్ల్యూఎస్ వెంటనే ఎగ్జిక్యూట్ చేయాలని సూ చించారు. అంతర్‌రాష్ట్ర సరిహద్దు ఉన్న ప్రాంతాల్లో పటిష్ట భద్రత చర్యలు చేపట్టాలని ఎలాంటి అక్రమ కార్యకలాపాలు జరగకుండా చూసుకోవాలన్నారు. సర్కిల్ పరిధిలో గంజాయి లాంటి మాదకద్రవ్యాల నిర్మూలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. సర్కిల్ కార్యాలయం రికార్డుల నిర్వహణ దర్యాప్తు తీరు సంతృప్తికరంగా ఉందని అభినందించారు. సీఐ సంతోష్‌కుమార్‌ను ప్రత్యేకంగా ప్రశంసించారు. అంతకు ముందు సీఐ కార్యాలయం రికార్డులను, పరిసర పరిశుభ్రతను పరిశీలించి అండర్ ఇన్వెస్టిగేషన్ ఉన్న గ్రేవ్ కేసుల వివరాలను సీఐ సంతోష్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఎస్పీ వాహిదుద్దీన్‌తో కలిసి మొక్కలు నాటారు.

ప్రజలను దగా చేసిన ప్రభుత్వం



బాకీ కార్డులు పంపిణీ చేస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు

మందమర్రి టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గత సార్వత్రిక ఎన్నికల సం దర్భంలో ఆచరణలో సాధ్యంకాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి సంపూర్ణంగా అమలు చేయలేదని బీఆర్‌ఎస్ పా ర్టీ చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ రాజా రమేశ్, మందమర్రి పట్టణ నాయకులు కొంగల తిరుపతిరెడ్డి, మేడిపల్లి సంపత్ పేర్కొన్నారు. గురువా రం పట్టణంలోని జాతీయ రహదారి వద్ద బాకీ కార్డు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిననాటి నుం చి ఇంత వరకు ప్రజలకు అనేక బాకీ పడ్డారని తెలిపారు. పెన్షన్ పెంపుదల నుంచి మొదలు కొని అనేక హామీలు మరి చిందన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజుకుమార్, సు రేందర్, ఎండీ అబ్బాస్, సంపత్, కనకం రవీందర్, పూసాల ఓదెలు, పల్లె నర్సింహులు, బెల్లం అశోక్ పాల్గొన్నారు.

తపాలా శాఖ సేవలు వినియోగించుకోవాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వెంకటేష్ దోత్రే, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, ఆర్డీవో లోకేశ్వర్‌రావు

ఆసిఫాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నూతన ఓటర్లకు గుర్తింపు కార్డులను తపాలా శాఖ ద్వారా అందించే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్య ఎలక్ట్రోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర ముఖ్య ఎలక్ట్రోరల్ అధికారి కార్యాలయం నుంచి గురువారం ఇతర అధికారులతో కలిసి వీసీ ద్వారా రాష్ట్రంలోని అన్ని జిల్లాల జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్‌లు, సహాయ ఎన్నికల అధికారులు, తహసీల్దార్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎలక్ట్రోరల్ అధికారి మాట్లాడుతూ నూతనంగా ఓటర్లుగా నమోదైన ప్రతి ఒక్కరికి తపాలా శాఖ ద్వారా ఓటరు గుర్తింపు కార్డులను పంపిణీ చేయాలని తెలిపారు. ఓటరు జాబితాలో 100 సంవత్సరాల వయస్సు కలిగిన ఓటర్లను గుర్తించి వారి వయస్సును తగిన ఆధారాలతో సమర్పించాలని చెప్పారు. బూత్ స్థాయి అధికారులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేయాలని అన్నారు. ఫారం 6, 7, 8 దరఖాస్తులను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ జాస్టిన్ జోల్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నూతనంగా ఓటరుగా నమోదైన వారికి తపాలా శాఖ ద్వారా ఓటరు గుర్తింపు కార్డులను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఓటరు జాబితాలో 100 సంవత్సరాల వయస్సు పైబడిన ఓటర్లను గుర్తించి వారి నిజ వయస్సు ఆధారంగా సవరించడానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. జిల్లాలోని బూత్ స్థాయి అధికారులకు గుర్తింపు కార్డులను పంపిణీ చేసేందుకు చర్యలు తీసు కుంటు న్నామని అన్నారు. పెండింగ్‌లో గల ఫారం-6, 7, 8 దరఖాస్తులు పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల పర్యవేక్షకులు శ్యాంలాల్ తదితరులు పాల్గొన్నారు.

కోల్ ఇండియా మాదిరిగా దీపావళి బోనస్ చెల్లించాలి

జైపూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు కోల్ ఇండియా మాదిరిగా దీపావళి బోనస్ చెల్లించాలని బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య పేర్కొన్నారు. గురువారం ఎస్‌టీపీపీ జీఎం నర్సింగరావుకు వినతిపత్రం అందించారు. , కాంట్రాక్ట్ కార్మికులకు బోనస్ ఇవ్వాలని బీఎంఎస్ బొగ్గు పరిశ్రమల ఇన్‌చార్జి కొత్తకాపు లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారన్నారు. ఎస్‌టీపీపీ కాంట్రాక్ట్ కార్మికులకు పీఎల్‌ఐ (దీపావళి బోనస్) చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీపీపీ బీఎంఎస్ నాయకులు దుస్స భాస్కర్, బోడకుంట శ్రీధర్ పాల్గొన్నారు.

గుడుంబా విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు

పెంచికలపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గుడుంబా విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనిల్‌కుమార్ తెలిపారు. మండలంలోని పోతెప ల్లి, బొంబాయి గూడ గ్రామాల్లో గుడుంబా విక్రయిస్తున్నారని అందిన సమాచారం మేరకు గురువారం దాడులు చేయగా పోతపల్లి గ్రామంలో పది లీటర్ల గుడుంబా, బొంబాయిగూడలో రెండు లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి నట్లు తెలిపారు. గుడుంబా తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్ శ్యాం పాల్గొన్నారు.

జాప్యం లేకుండా సీఎంపీఎఫ్ సేవలు



మాట్లాడుతున్న సీఎంపీఎఫ్ రీజనల్ కమిషనర్ హరి పచౌరి

రెబ్బెన, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జాప్యం లేకుండా సీఎంపీఎఫ్(కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్) సేవలను ఉద్యోగులకు అందించేందుకు కృషి చేస్తున్నామని సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్ హరి పచౌరి అన్నారు. గోలేటి లోని జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం ప్రయాస్ మూడో విడత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎంఎఫ్ రీజనల్ కమిషనర్లు హరిపచౌరి, గోవర్ధన్ మాట్లాడారు. సీఎంపీఎఫ్ లావాదేవీలు అన్ని సికేర్స్ పోర్టల్ ద్వారా మాత్రమే జరుగుతున్నాయని చెప్పారు. ఉద్యోగులు ఎలాంటి మధ్యవర్తులు లేకుండా సీఎంపీఎఫ్ సేవలను పారదర్శకంగా పొందవచ్చని సూచించారు. సీఎంపీఎఫ్ బెనిఫిట్స్‌కు అర్హులు, పెన్షన్, రివైస్డ్ పెన్షన్ పట్ల అవగాహన కల్పించారు. ఉద్యోగుల ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. పెన్షన్, సీఎంఈఎఫ్ దరఖాస్తులు పెండింగ్ ఉండకుండా చర్యలు చేపట్టాలని చెప్పారు. జీరో పెండింగ్ స్థాయికి తీసుకు వచ్చేందుకు ప్రతీ ఉద్యోగి కృషి చేయాలని సూచించారు. గతంలో పెండింగ్‌లో ఉన్న రికార్డులను ఏరియా అధికారులకు అందించారు. ఉద్యోగులు ఒక దరఖాస్తు కూడా పెండింగ్‌లో లేకుండా చూడాలని సూచించారు. సమావేశంలో ఎస్‌ఓటు జీఎం రాజమల్లు, పర్సనల్ డిపార్టుమెంట్ హెచ్‌వోడీ శ్రీనివాస్, సీనియర్ పర్సన్ అధికారి ప్రశాంత్, సంక్షేమాధికారి రజినికుమార్, సీఎంపీఎఫ్ ఉద్యోగులు మనోహర్, అనిత, అన్ని విభాగాల సంక్షేమ జూనియర్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఆస్తుల పరిరక్షణకు పాటుపడాలి

శ్రీరాంపూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆస్తుల పరిరక్షణకు పాటుపడాలని కార్పొరేట్ జీఎం(సెక్యూరిటీ) లక్ష్మీనారాయణ, శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ అన్నారు. సెక్యూరిటీ విభాగం ఉద్యోగులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్లు మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియా సింగరేణికి అత్యంత ప్రాధాన్యత కలిగిన ఏరియా అని, సెక్యూరిటీ విభాగం ఎంతో ముఖ్యమైన విభాగమని చెప్పారు. సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిరంతరం నిఘా కొనసాగించాలని ఆదే శించారు. సిబ్బంది క్రమశిక్షణతో పనిచేస్తూ సంస్థ అభివృద్ధికి పాటుపడాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, డీజీఎం(పర్సనల్) అనిల్ కుమార్, ఏరియా సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి, సెక్యూరిటీ విభాగం ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న జీఎంలు

సింగరేణి సమాచారం

సింగరేణి అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



రిటైర్డ్ సేఫ్టీజీఎంను సన్మానిస్తున్న డైరెక్టర్లు

మందమర్రిటౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ అభివృద్ధిలో రిటైర్డ్ డైరెక్టర్లు, జీఎంలు భాగస్వాములు కావాలని ప్రగతికి సంబంధించి విలువైన సూచనలు, సలహాలు ఇవ్వాలని సింగరేణి డైరెక్టర్‌పా గౌతం పొట్రు అన్నారు. రిటైర్డ్ సేఫ్టీ జీఎం గురువయ్యను గురువారం సన్మానించారు. దీనిలో సింగరేణి డైరెక్టర్లు, జీఎంలు ఇక నుంచి తాము నిర్వహించే సమావేశాలకు సమాచారం అందిస్తే హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ కార్మికులకు లాభాల వాటా చెల్లించాలి

శ్రీరాంపూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పనిచేస్తూ రిటైర్ అయిన ఉదోగులకు లాభాల్లో వాటా, దీపావళి బోనస్ చెల్లించాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి అళవందార్ వేణుమాధవ్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులకు గత నెల 29న 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లాభాల వాటా 34 శాతం అందించారని తెలిపారు. దీపావళి బోనస్(పీఎల్‌ఆర్) ఈ నెల 17వ తేదీన చెల్లిస్తామని యాజమాన్యం ప్రకటించిందని పేర్కొన్నారు. ఈ సారి బోనస్ రూ.1,03,000 రానుందని తెలిపారు.

విద్యారంగం బలోపేతం దిశగా ప్రభుత్వం చర్యలు

కలెక్టర్ కుమార్ దీపక్



కోటపల్లిలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

కోటపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) :విద్యారంగ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలను సందర్శించి కొనసాగుతున్న అభివృద్ధి పనుల పరిశీలించారు. పనులను సత్వరమే పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించి, నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. పాఠశాలలో కొనసాగుతున్న మూత్రశాలలు, విద్యుత్, పేయింటింగ్స్, అవసరమైన మరమ్మతులను వేగవంతం చేసి త్వరగా పూర్తి అధికారులకు సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ మెనూ, తదితర సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించి, బాగా చదివి ఉన్నత ఉద్యోగాలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాఘవేంద్రరావు, ఎంపీడీవో నాగేశ్వర్‌రెడ్డి, హెచ్ఎం మధునయ్య పాల్గొన్నారు.

బంద్‌కు మద్దతు తెలుపుతున్నాం



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

బెల్లంపల్లి, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 18న బీసీ సంఘాలు తలపెట్టిన రాష్ట్ర బందు పిలుపు మేరకు సీపీఐ పార్టీ తరుపున మద్దతు తెలుపుతున్నామని సీపీఐ పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ బీసీలకు 42శాతం రిజర్వేషన్లు రాకుండా రెడ్డి సామాజిక వర్గం బీజేపీ అడ్డుపడడం సమంజసం కాదన్నారు. హైకోర్టులో వేసిన పిటిషన్‌ను వాపస్ తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు తిలక్, రాజన్న, రాజేశం, ఉపేందర్ పాల్గొన్నారు.

●ఈ నెల 18న రాష్ట్ర వ్యాప్తంగా బీసీ సంఘాలు చేపడుతున్న బందుకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని జిల్లా ప్రవేటు సంస్థల యజమాన్యాలు పేర్కొన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అగ్ర వర్ణాలు చేస్తున్న కుట్రలో భాగంగా బీసీ రిజర్వేషన్లపై హైకోర్టులో వ్యతిరేకంగా కేసు వేయడం వల్ల హైకోర్టు స్టే ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. విద్యార్థి సంఘాలు నాయకులు బీసీ సంఘాల మద్దతుకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు రాజేశ్, అల్లీసాగర్, శ్రీనివాస్, బీసీ సంక్షేమం జిల్లాఅధ్యక్షుడు చంద్రమోహన్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

గంభీరావుపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్టు ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు. మల్లారెడ్డిపేటకు చెందిన చందు, నందం అనుమతి లేకుండా వాగు నుంచి ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తున్నారని ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు. ట్రాక్టర్‌ను సీజ్‌చేసి ఓనర్, డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

చేప పిల్లల పంపిణీకి సిద్ధం



● వారం రోజుల్లో ప్రారంభం కానున్న ప్రక్రియ..

నస్పూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నీటి వనరుల్లో మత్స్య సంపద పెంచి మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు మెరుగు పర్చడానికి మత్స్య శాఖ ఏర్పాట్లను ప్రారంభించింది. ఇందులో భాగంగా ఈ ఏడాది 389 చెరువులు, కుంటలు, మధ్య చిన్న తరహా ప్రాజెక్టుల్లో 2.26 కోట్ల చేప పిల్లలను వేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా 125 మత్స్య సహకార సంఘాలు పని చేస్తుండగా సుమారు ఏడు వేల మంది మత్స్యకారులు సభ్యత్వం కలిగి ఉన్నారు. జిల్లాలోని నీటి వనరుల్లో మరో వారం రోజుల్లో నాలుగు రకాల చేప పిల్లలను విడుదల చేయడానికి శాఖ అధికార యంత్రాంగం సన్నాహాలు మొదలు పెట్టింది. రాష్ట్రంలో ఏదో ఒక చోట ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేప పిల్లల పంపిణీ కార్యక్రమం ప్రారంభించగానే జిల్లాలో కూడా పంపిణీ ప్రారంభించనున్నారు. గతేడాదిలో టెండర్ ప్రక్రియలో ఆలస్యం కావడం వలన పంపిణీ కూడా ఆలస్యమైంది. ఈ ఏడాది టెండర్ ప్రక్రియ నిర్వహణ కొంత ఆలస్యం అయినప్పటికీ ఇద్దరు కాంట్రాక్టర్లను ఫైనల్ చేశారు. అంతే కాకుండా అధిక వర్షాల కారణం పంపిణీ ఆలస్యం జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. మొత్తానికి వారం రోజుల్లో చేప పిల్లల ప్రక్రియ ప్రారంభించి నవంబరు మొదటి వారం లోగా ముగించాలని అధికార యంత్రాంగం ప్రయత్నాలు చేపట్టింది. జిల్లాలో చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల్లో సమృద్ధిగా నీరు చేరి జల కళతో కళకళలాడుతున్నాయి.

● 389 నీటి వనరుల్లో...

జిల్లాలో 389 కుంటలు, చెరువులు, చిన్నమధ్య తరహా ప్రాజెక్టులున్నాయి. నీటి వనరుల సామర్థ్యాన్ని బట్టి చేప పిల్లలను వేయనున్నారు. జిల్లాలో ఎల్లంపల్లి ప్రాజెక్టుతో పాటు చిన్న తరహా ర్యాలీ వాగు, నీల్వాయి వాగు, గొల్లవాగులున్నాయి. ఈ ప్రాజెక్టుల్లో రవ్వ, బొచ్చ, బంగారు తీగ, మోసు నాలుగు రకాల చేప పిల్లలను తెప్పించనున్నారు.

ఈ ఏడాదిలో వర్షాలు సమృద్ధిగా కురిశాయి. ఇప్పటికీ ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటి విడుదలతో దిగువన గోదావరి నది పరవళ్లు తొక్కుతోంది. ఆశించిన విధంగా వర్షాలు సమృద్ధిగా కురియడం, చెరువులు, ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరడంతో నీటి మట్టం పెరిగింది. ఆలస్యం చేయకుండా చేప పిల్లలను వదిలితే మత్స్యకారులకు లాభాలను తెచ్చిపెడతాయని ఆశిస్తున్నారు. జిల్లాలో చేపల వ్యాపారానికి మంచి గిరాకి ఉంది. ఇతర ప్రాంతాల నుంచి కూడా వివిధరకాల చేపలు ఇక్కడకు వ్యాపారులు తరలించి విక్రయిస్తారు. మత్స్యకార కుటుంబాలు చేపల వ్యాపారంతో జీవనో పాధి పొందే అవకాశం ఉంటుంది.

వారం రోజుల్లో పంపిణీ



ప్రభుత్వ నుంచి అనుమతి రాగానే జిల్లాలో నీటి వనరుల్లో పెంపకం కోసం 2.26కోట్ల చేప పిల్లలను పంపిణీ చేస్తాము. వారం రోజుల్లో పంపిణీ చేసే అవకాశం ఉంది. చేపపిల్లల పంపి ణీ చేపట్టి నవంబరు మొదటి వారంలోగా పంపి ణీ పూర్తి చేస్తాం. ప్రస్తుతం గోదావరినది నీటి ప్రవాహం ఉన్నందున మత్స్య కారులు చేపల వేటలో జాగ్రత్తలు పాటించాలి. మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుంది.

- ఆర్ అవినాష్, మత్స్య శాఖ జిల్లా అధికారి, మంచిర్యాల

నత్తల నివారణకు చర్యలు చేపట్టాలి

నెన్నెల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : నందులపల్లి గ్రామంలో పంటలకు నత్తల బెడద అధికంగా ఉందని మండల వ్యవసాయ అధికారి పుప్పాల సృజన తెలిపారు. గురువారం గ్రామంలోని పంట పొలాలను సందర్శించి, రైతులకు సలహాలు, సూచలిచ్చారు. నత్తలను నివారించేందుకు మెటల్డిహైడ్ 2.5 డీపీ అనే ఒక కేజీ మందును ఎకరం చేనులో అక్కడక్కడ సాయంత్రం పూట పెట్టాలన్నారు. దీన్ని తిని నత్తలు మృతి చెందుతాయని చెప్పారు. ఎండ పూట నత్తలు అన్ని ఒకే చోట నీడలో ఆశ్రయం పొందుతాయని వాటిపై ఉప్పు కలిపిన ద్రావణాన్ని పోసి నివారించవచ్చన్నారు. వెంట ఏఈవో రామ్‌చందర్ ఉన్నారు.

ఆలయంలో చోరీ

భీమారం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) భీమారం మండల కేంద్రంలోని ముదిరాజ్ కాలనీలోని లక్ష్మీదేవర ఆలయంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గుడి తలుపులను పగులగొట్టి రెండు తులాల బంగారం, రెండు కిలోల వెండి ఆభరణాలను దొంగిలించుకొని వెళ్లారని ఆలయ నిర్వాహకులు అన్నవేణి సారయ్య ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ తెలిపారు. నిర్వాహకుడు ప్రతి రోజు మాదిరిగానే గురువారం ఉదయం సైతం ఆలయ శుభ్రత కోసం వెళ్లగా తలుపులు పగుల గొట్టి ప్రధాన ద్వారం తెరుచుకొని ఉండటాన్ని చూసి విస్మయానికి గురై కాలనీ వాసులకు తెలపడంతో కేసు పెట్టారని తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లు త్వరగా పూర్తి చేయాలి



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీవో

జైపూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇండ్లు త్వరగా పూర్తి చేయాలని ఎంపీఓ శ్రీపతి బాపురావు పేర్కొన్నారు. గురువారం ఆయన మండలంలోని పెగడపల్లి గ్రామ పంచాయతీలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను హౌసింగ్ ఏఈ కాంక్షతో కలిసి పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని, తడిచెత్త, పొడి చెత్త వేరు చేయాలని, ప్లాస్టిక్ లేకుండా చూసుకోవాలని కార్యదర్శికి సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి డి. పావని పాల్గొన్నారు.

నిరుపేద వైద్యం కోసం ఆర్థిక సాయం



బాధితులకు నగదు, బియ్యం అందిస్తు్న సీఐ

నెన్నెల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న నిరుపేద మహిళ దుర్గం రాజక్కకు వైద్యం కోసం బెల్లంపల్లి రూరల్ సీఐ హనోక్ గురువారం రూ. 20 వేల నగదు అందజేశారు. నెన్నెలకు చెందిన దుర్గం రాజక్క నెల రోజులుగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. వైద్యం కోసం పెద్ద మొత్తంలో ఖర్చు అవుతాయని డాక్టర్లు చెప్పారు. రాజక్క వైద్యం చేయించుకునే స్థోమత లేదన్న విషయం తెలుసుకున్న పలువురు సాయం చేసేందుకు ముందుకు వచ్చారు. సీఐ హనోక్ రూ. 10వేలు, 25 కేజీ బియ్యం, నెన్నెల ఎస్సై ప్రసాద్ రూ. 5 వేలు, ఎంపీడీవో అబ్దుల్ హై రూ. 2 వేలు, స్థానిక విలేకరులు రూ. 3 వేలు ఇచ్చారు. నగదు, బియ్యం సీఐ చేతులు మీదుగా అందించారు.

అటవీ సంపదకు రక్షణ ఏది..?

(3వ పేజీ తరువాయి)

నరికివేసిన స్మగ్లర్లు కలపు అక్రమంగా తరలించుకుపోయారు. అయినా సంబంధిత అధికారులకు సమాచారం లేకపోవడం గమనార్హం. ఆ తరువాత సమాచారం అందుకున్న అధికారులు డాగ్ స్క్వాడ్ స హాయంతో తనిఖీలు చేపట్టగా కొట్టివేసిన చెట్ల మొద ళ్ల దర్శనమిచ్చాయి. డాగ్ స్క్వాడ్ సహాయంతో నిందితుల సమాచారం లభించినా, అప్పటి వరకు స్మగ్లర్ల కదలికలు అధికారుల దృష్టికి రాకపోవడం గమనార్హం. అటవీ అధికారుల వ్యవహారం చూస్తుంటే 'చేతులు కాలినంక... ఆకులు ప ట్టుకున్న' సామెత గుర్తుకు వస్తోంది. ఒక్క బీట్‌లోనే ఇంత పెద్ద మొత్తంలో కలపను తరలించారం టే...ఇతర ప్రాంతాల్లో ఇంకా ఏ మేరకు కర్ర స్మగ్లింగ్ జరిగిందోనన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి.

సౌకర్యాలున్నా...ఉపయోగం సున్నా...

ప్రభుత్వం అటవీ సిబ్బందికి అన్ని వసతులు సమ కూరుస్తోంది. నెలనెలా వేలకు వేలు వేతనాలు చెల్లి స్తోంది. అడవుల్లో తిరిగేందుకు మోటారు సైకిళ్లు, నావి గేషన్ కోసం ఖరీదైన సెల్‌ఫోన్లు, నిఘా కోసం సీసీ కె మెరాలు అందజేస్తోంది. స్మగ్లర్ల ఆట కట్టించేందుకు స్థా నిక పోలీసుల సహకారం తీసుకునే వెసులుబాటు క ల్పించింది. కానీ అటవీశాఖ అధికారులు, సిబ్బందిలో నెలకొన్న నిర్లిప్తత, నిర్భీతి కారణంగా ఎలాంటి ఫలితం లేకుండా పోతోంది. కీలక ప్రాంతాల్లో రాత్రింబవళ్లు కావలా కాసేందుకు అటవీ డివిజన్ల వారీగా బేస్ క్యాంపు లు ఏర్పాటు చేసినా వాచర్లు కనిపించడం లేదనే విమర్శలున్నాయి. అడవుల రక్షణ కోసం ప్రభుత్వం పెద్ద మొత్తంలో ఖర్చు చేస్తూ అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నా...ఉపయోగం లేకుండా పోతోందనే అభిప్రాయా లు వ్యక్తమవుతున్నాయి.

42శాతం రిజర్వేషన్ల కోసం పోరాటం

రేపటి బంద్‌ను విజయవంతం చేయాలి

బీసీ సంఘ నాయకుల పిలుపు

మందమర్రి టౌన్, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలు సాధన కోసం సంఘటిత పోరాటాలు అవసర మని బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు చకినాల శంకర్, గౌరవ అధ్యక్షుడు పోలు శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్. వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గురువారం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 18న రిజర్వేషన్ల సాధన కోసం చేపట్టిన బందును విజయవంతం కోసం సంఘ సభ్యులు పాటు పడాలన్నారు. అగ్రవర్ణ కుట్రలో భాగంగా 42శాతం రిజర్వేషన్‌కు హైకోర్టు స్టే ఇవ్వడం దారుణమ న్నారు. సుప్రీం కోర్టులో ప్రభుత్వం ఇచ్చిన రిజర్వేషన్ కొట్టి వేశారన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని రిజర్వేషన్లు ఏకైక లక్ష్యంగా పోరాటాల్లో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. ఇప్పటికే దీనికి సంబంధించి జిల్లా వ్యాప్తంగా సమావేశాలు నిర్వహిస్తున్నారన్నారు. తాము కూడా సంఘ సభ్యులను కలిసిన ఈ బందు విజయవంతం కోసం పాటుపడుతామన్నారు. రాజ్యాధి కారమే ఏకైక లక్ష్యంగా పని చేయాలన్నారు. రిజర్వేషన్‌లను నోటి కాడి బుక్కను లాక్కున్నట్టుగా అయిందన్నారు. ప్రతి ఒక్క బీసీ రిజర్వేషన్లను లేకపోతే జరిగే నష్టాలు గుర్తించి భవిష్యత్ లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా పట్టణ నాయకులు సతీస్‌బాబు, రామసాని శంకర్, బేర వేణుగోపాల్, ప్రభాకర్, రాజు, జమాల్‌పూర్ నర్సోజీ, సారంగపాణి, సత్యనారాయణ, సంపత్, కుమార్, నర్సింహాచారి, రాయబారం వెంకన్న, సంపత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

జన్నారం బందుకు సహకరించాలి

జన్నారం: ఈ నెల 18న జన్నారం మండల బందుకు అన్ని వర్గాల వారు సహకరించాలని మున్నూరుకాపు సంఘం మండల అధ్యక్షుడు కాసెట్టి లక్ష్మణ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీసీల రిజర్వేషన్ 42శాతం సాధించే వరకు ఉద్యమిద్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం నాయకులు శంకరయ్య, గోపి సత్యనారాయణ, శ్రీపతి ఆనందం, రాజుకుమార్, పురు షోత్తం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

●విశ్వబ్రాహ్మణుల ఆధ్వర్యంలో మండలంలో స్వచ్ఛందంగా బందుకు పిలుపునివ్వాలని జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల గంగాధర్ అన్నారు. బీసీ రిజర్వేషన్ సాధించుకునే వరకు ఐక్యంగా పోరాడు దామన్నారు. నాయకులు వెయిగల్ల రవి లక్ష్మీ నర్సయ్య, వెంకటేశ్, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

భీమారం : బీసీ బంధును మండలంలోని వివిధ గ్రామాలలో ఉన్న బీసీ నాయకులు, మేధావులు, యువత విజయవంతం చేయాలని మండల ఐక్య వేదిక పిలుపునిచ్చింది. మండల కేంద్రంలో గురువారం వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఐక్యవేదికలో పలువురు పాల్గొని మాట్లాడారు. అగ్రవర్ణాలు చేస్తున్న కుట్రలో భాగంగా బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే ఇవ్వడాన్ని నిరసిస్తూ ఈ నెల 18న సంపూర్ణ బందును ప్రకటించాలని, తద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బీసీ ఐక్యత చాటిన వారు అవుతారని, జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లను సమపంపిణీ చే యాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. రాజ్యాంగ బద్ధంగా బీసీలకు రావాల్సిన హక్కులను వారికి అందించాలని వివిధ కుల సంఘాల నాయకులు పేర్కొన్నారు. పార్టీలకు, కులాలకు అతీతంగా బీసీ రిజర్వేషన్ ఏకైక ఎజెండాగా పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

- ఏఐసీసీ పరిశీలకుడు నరేష్ కుమార్



దరఖాస్తు స్వీకరిస్తున్న ఏఐసీసీ పరిశీలకుడు నరేష్ కుమార్

మంచిర్యాల క్రైం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రతి కార్యకర్త కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఏఐసీసీ పరిశీలకుడు నరేష్ కుమార్ అన్నారు. డీసీసీ ఎంపికలో భాగంగా గురువారం మంచిర్యాల పట్టణంలో ఏర్పాటు చేసిన ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, బూత్ స్థాయి, మండల స్థాయి, బ్లాక్ స్థాయిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు జిల్లా అధ్యక్షుల ఎంపిక చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రాధాన్యత కల్పిస్తామని, అందరి అభిప్రాయాలను అధిష్టానానికి పంపిస్తామన్నారు. పీసీసీ పరిశీలకులు జ్యోతి, అనిల్ కుమార్, తిరుపతి పాల్గొన్నారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు



కాసిపేట గేటు ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

కాసిపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : తాగునీటి కోసం మహిళలు రోడ్డెక్కారు. నెల రోజులుగా కాసిపేట, ముత్యంపల్లి, చిన్న ధర్మారం, గ్రామ పంచాయతీల్లో తాగునీటి ఎద్దడిని నివారించాలని కోరుతూ గురువారం బీజేపీ ఆధ్వర్యంలో కాసిపేట 1వ గని గేటు ముందు మహిళలు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు సంపత్ కుమార్ మాట్లాడుతూ కాసిపేటలో ఏర్పాటు చేసిన భూగర్భ గని వల్ల సమీప గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. దీంతో కాసిపేట, ముత్యంపల్లి, చిన్న ధర్మారం, గ్రామ పంచాయతీల్లో తాగు నీటికి తీవ్ర కొరత నెలకొంది. సింగరేణి ఫిల్టర్ బెడ్ నుంచి నీరు సరఫరా చేస్తున్నప్పటికీ ఫిల్టర్‌బెడ్ శుభ్రత లేకపోవడం వల్ల ఆ నీటిని వాడిన ప్రజలు చర్మ వ్యాధులబారిన పడి తీవ్ర ఇబ్బందులు పడతున్నా రన్నారు. కొన్ని రోజులుగా సింగరేణి సరఫరా చేసే నీరు కూడా గ్రామాల్లోకి రావడం లేదన్నారు. అనంతరం కాసిపేట 1వ గని అదనపు మేనేజర్ నిఖిల్ అయ్యర్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. మూడు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో బాకి కిరణ్, నగురారపు ప్రసన్న, మహిళలు పోసు, లచ్చక్క, కవిత, పద్మ, మహేశ్వరి, లక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

జ్యోతినగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఇందిరమ్మ కాలనీకి చెందిన కాసుల రాకేష్(31) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. నాలుగు రోజుల క్రితం ఆత్మహత్య చేసుకున్న రాకేష్ మృతదేహాన్ని గురువారం కనుగొన్నారు. ఎన్టీపీసీ ప్రాజెక్టులో కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తున్న రాకేష్ ఇందిరమ్మ కాలనీలో నివసిస్తున్నాడు. ఏడాది క్రితం అతని తండ్రి, 15 రోజుల క్రితం రాకేష్ తల్లి చనిపోయింది. నాలుగు రోజుల క్రితమే తండ్రి సంవత్సరీకం, తల్లి దశదిన కర్మ నిర్వహించాడు. రాకేష్‌కు అక్క, బావ ఉన్నారు. దశదిన కర్మ జరిగిన రోజున బావతో రాకేష్ గొడవ పెట్టుకున్నాడు. దీంతో అక్క, బావలు ఇంట్లో నుంచి వెళ్లిపో యారు. తల్లిదండ్రులు దూరమైన బాధలో ఉన్న సమయంలో అక్కాబావలు కూడా దూరం కావడంతో అదే రోజు ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే ఇంటి నుంచి దుర్వాసన వస్తుండడంతో చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు తలుపు తెరవడంతో రాకేష్ ఆత్మహత్య చేసుకున్నట్లు వెల్లడైంది.. ఎన్టీపీసీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాలి

బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్

కాసిపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలను భవిష్యత్తు తరాలకు సజీవంగా అందించాలని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ అన్నారు. గురువారం దేవాపూర్ సల్పలవాగు వెంకటాద్రి ఆలయం ఆవరణలో జరిగిన దండారి దర్బార్‌కు ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు చాలా ప్రాచీనమైనవని, అలాగే భిన్నమైనవి కూడా వీటిని ఇంతకాలం సజీవంగా కాపాడుతూ సంప్రదాయ వేడుకలను నిర్వహించడంపై నిర్వాహకులను ఆయన అభినందించారు. అలాగే నేటి యువత చెడు వ్యసనాలకు బానిసలై విలువైన జీవితాలను కోల్పోతున్నారు. అలా కాకుండా ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని మంచి చదువులతో రాణిస్తే ఉత్తమ పౌరులుగా ఎదిగి ప్రభుత్వ ఉద్యోగాలు సాధిస్తారని అన్నారు. ఏది సాధించాలన్నా అన్నింటికి చదువే మూలం, కాబట్టి చదువుల్లో పోటీ పడాలని సూచించారు. అనంతరం గిరిజన సంప్రదాయ వాయిద్యాలతో సల్పల వాగు ప్రాంతమంతా మారుమోగింది. గుస్సాడి నృత్యాలు, మహిళల ఆటపాటలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమలో ఓరియంట్ (అదాని) సిమెంట్ కంపెనీ యూనిట్ హెడ్ బాలగిరిధర్, మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, దేవాపూర్ ఎస్సై గంగారాం, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రమణారెడ్డి, వాల్మీకి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొంది వెంకటరమణ, ఉత్సవ నిర్వాహణ కమిటీ అధ్యక్షుడు కుమురం జనార్ధన్, కమిటీ నాయకులు జంగు, పెంద్రం హన్మంతు, రామ్‌దాస్, ప్రభాకర్, సోయంజంగు, కనకరాజు, మహేష్, జంగు, వెంకటేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్



సల్పల వాగులో దండారి నృత్యాలు చేస్తున్న గుస్సాడీలు

గురుకులాల్లో సీట్ల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో షెడ్యూల్డ్ కులాల గురుకులాల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని జిల్లా సాంఘిక సంక్షేమ గురుకులాల సమన్వయ అధికారి యాదగిరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఆసిఫాబాద్ బాలుర, రెబ్బెన బాలికల, సిర్పూర్(టి) బాలికల, కాగజ్ నగర్ బాలికలలో 6, 7, 8, 9 తరగతుల్లో మిగిలి ఉన్న ఖాళీలను బీఎల్‌వీ సెట్ ఎంట్రెన్స్-2025 రాసి మెరిట్ జాబితాలో ఉన్న విద్యార్థులతో భర్తీ చేయనున్నామని పేర్కొన్నారు. ఈ నెల 21న ఉదయం 21 తేదీన సాయంత్రం 4 గంటల లోపు జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాలలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని గిరిజన డిగ్రీ కళాశాలలో గురువారం భారత ప్రభుత్వ పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఎంటర్ ప్రెన్యూర్ అవైర్‌నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. యువత పరిశ్రమలు స్థాపించడానికి వ్యాపారాలు చేయడానికి ప్రాజెక్టు రిపోర్టు తయారు చేయడం, వ్యాపారంలో మెలకువలు, పరిశ్రమలు స్థాపించడానికి ప్రభుత్వం సబ్సిడీ స్కీంల గురించి పీఎంఈజీపీ స్కీంపై పూర్తి వివరాలు తెలియజేశారు. కార్యక్రమంలో శిక్షకులు కోటేష్, శ్రీనివాస్ యాదవ్, ప్రిన్సిపాల్ శారద, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వరికి ఎండాకు తెగులు

- ఆందోళనలో అన్నదాతలు
- అధిక వర్షాలే కారణమంటున్న వ్యవసాయాధికారులు
- దిగుబడి తగ్గుతుందని రైతుల ఆవేదన



బెజ్జూరులో ఎండు తెగులు సోకిన వరి

బెజ్జూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది అధిక వర్షాల ప్రభావంతో వానాకాలం సాగు చేసిన వరి పైరుకు కంకి పాలు పోసుకునే దశలో ఎండు తెగులు, కాటుక తెగులు సోకింది. దీంతో వరి పైరు కంకి కాండం భాగంలో ఆకులు ఎండి మాడిపోతున్నాయి. ఈ దశలో వరి పైరుకు ఎండు తెగులుతో పంట దిగుబడి సగానికి సగం తగ్గుతుందని బాధిత రైతులు గగ్గోలు పెడుతున్నారు. గత జూలై, ఆగస్టు నెలలో సాగు చేసిన వరి పైరుకు ఈ ఎండ తెగులుతో పాటు కాటుక తెగులు సోకడంతో రైతులు పలుమార్లు మందులు వాడినా ఫలితం లేదని రైతులు చెబుతున్నారు. జిల్లాలో సుమారు 56వేల ఎకరాల్లో వరి సాగవుతోంది. జిల్లాలో పలుచోట్ల రైతులు సాగు చేస్తున్న వరి పంటకు ఎండు తెగులు సోకిన మూలంగా తీవ్ర నిరాశ చెందు తున్నారు. వరి పైరు పక్వానికి వచ్చి మరో 10-15రోజుల్లో కోతలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ దశలో ఎండు తెగులుతో దుబ్బు పైభాగం కాండం ఎండిపోతోంది. దీంతో వరి పాలు పోసుకుంటున్న వరి కంకులు తాలుగా మారడమే కాకుండా నలుపు రంగుగా మారుతుందని రైతులు వాపోతున్నారు.

వర్షాల వల్లే..

వరి పంట వేసిన రెండు నెలల అనం తరం ఏకధాటిగా వర్షాలు కురవ డంతోనే వరికి ఎండు తెగులు సోకిందని వ్యవసాయ అధికారులు భావిస్తున్నారు. తొలకరి ఆరంభంలో ఓ మోస్తరుగా వర్షాలు కురిసి ఆ తర్వాత సరైన వర్షాలు కురవలేదు. అనంతరం ఏకధాటిగా కురిసిన వర్షాలతో పంటకు తెగుళ్లు సోకాయని చెబుతున్నారు. ఇప్పటికే సాగుకు అవసరమైన పెట్టుబడులు పెరగగా, తెగులు కారణంగా మందులు పిచికారి చేయయడంతో మరింత పెట్టుబడి పెరిగిందని రైతులు వాపోతున్నారు.

లక్షణాలు ఇలా..

ఎండాకు తెగులు ఆశించినప్పుడు ఆకుమీద పసుపు రంగు నీటి మచ్చలు ఏర్పడి, అంచుల వెంబడి అలల మాదిరిగా పైనుంచి కిందకు వస్తాయి. ఈ తెగులు సోకిన పంటను ఉదయం వేళ పరిశీలిస్తే ఆకుల నుంచి పచ్చని జిగురు పదార్థం పైకి వస్తుంది. ఈ పదార్థం సూర్యరశ్మికి గట్టిపడి చిన్న,చిన్న ఉండలుగా మారు తుంది. గాలి వీచినప్పుడు ఆకు నుంచి నీటిలోకి, ఇతర మొక్కలకు వ్యాపిస్తుంది. వరి పైరు పొట్ట దశలో తెగులు ఆశించినట్లయితే ఆకుల్లో హరిత పదార్థం తగ్గడం ద్వారా వెన్నులు పాక్షికంగా మాత్రమే బయటకు వస్తాయి. దీని వల్ల గెలలు పాలుపోసుకోక తాలు గింజలుగా మారిపోతాయి. చెట్లనీడలో ఉన్న పంటలో ఈ లక్షణాలు ఎక్కువగా గమనించవచ్చు. రైతులు ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే వ్యవసాయ అధికారులను సంప్రదిస్తే ఉత్తమం.

వానాకాలం సీజన్‌లో సాగు చేసిన వరి పైరుకు వరుస వర్షాల వల్ల ఈ రకమైన తెగులు సోకుతుందని మండల వ్యవసాయ అధికారి నాగరాజు చెబుతున్నారు. ఈ దశలో వరి పైరుకు తెగులు నివారణ సాధ్యం కాదని చెప్పారు. యూరియా ఎక్కువ మోతాదులో వాడడంతో తెగులు ఎక్కువగా సోకే అవకాశం ఉందని వివరించారు. ఎండు తెగులు కారణంగా ఈ ఏడాది వరి పంట దిగుబడి సగానికి పైగా తగ్గే అవకాశాలు ఉన్నాయని రైతులు వాపోతున్నారు. ఒకవైపు వరి పంట నష్టాల పాలవుతుండగా అధిక వర్షాల కారణంగా పత్తి పంటకు తీరని నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తెగులు నివారణకు..

నత్రజని, కాంప్లెక్స్ ఎరువుల వాడకం తగ్గించాలి. సీవోసీ 100 గ్రాములు/ప్లాంటో మైసిన్ 400 గ్రాములు ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి. స్రెపితోమైసిన్/ప్లాంటో మైసిన్/అగ్రిమైసిన్ 100 లేదా 200 గ్రాములు ఎకరానికి వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేసి తెగులును నివారించవచ్చు. పొలా నికి రోజు విడిచి రోజు తడులు అందిస్తూ ఉండాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

సోమినికి బస్సు సేవలు ప్రారంభం



డ్రైవర్, కండక్టర్లను సన్మానిస్తున్న గ్రామస్థులు

బెజ్జూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గిరిజన గ్రామమైన సోమినికి గురువారం ఆర్టీసీ బస్సు సేవలు ప్రారంభమయ్యాయి. ఇన్నాళ్లు సోమిని గ్రామానికి రోడ్డు బాగా లేక పోవడంతో ఆర్టీసీ అధికారులు బస్సును నిలిపి వేశారు. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో కుశ్నపల్లి నుంచి సోమిని వరకు రోడ్డు మరమ్మతు పనులు చేయించడతో రవాణా సౌకర్యం మెరుగు పడింది. దీంతో మాజీ ఎమ్మెల్యే కోనప్ప ఆర్టీసీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి బస్సును పునరుద్ధరింపజేశారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. సోమినికి మొదటి సారి బస్సు రావడంతో డ్రైవర్, కండక్టర్లను గ్రామస్థులు సన్మానించారు.

పనులను వేగవంతం చేయాలి



పంచాయతీ భవనం పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రసాద్

కౌటాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో ప్రసాద్ అన్నారు. కౌటాల మండలం శిర్సా గ్రామ పంచాయతీ భవన పనులతో పాటు గ్రామంలో మంజూరు అయిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఎంపీడీవో ప్రసాద్ పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేయానలి కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఉపాధి హామీ కూలీల ఈ-కేవైసీ ప్రక్రియ వేగవంతం చేసి తరువాత పూర్తి చేయాలని, రాబోయే సంవత్సరానికి పనులు గుర్తించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. నర్సరీ , గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, ఇందిరమ్మ ఇళ్ల పురోగతి, నిర్మాణాలు ప్రారం భించని లబ్ధిదారులను ప్రోత్సహించి త్వరగా నిర్మాణాలు చేపట్టే విధం గా చూడాలని సూచించారు. ఆయన వెంట ఎంపీవో మహేందర్‌రెడ్డి, ఏపీవో పూర్ణిమ, కార్యదర్శి విఠల్ తదితరులు ఉన్నారు.

ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

సిర్పూర్(టి), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కౌటాల మండలానికి చెందిన కొందరు ద్విచక్ర వాహనాలపై వేర్వేరుగా ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యంను అక్రమంగా వెంకట్రావుపేట మీదుగా మహారాష్ట్రకు తరలిస్తుండగా గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు రాజ్‌కుమార్, శ్రీనివాస్ పట్టుకున్నారు. ఈ మేరకు బియ్యంను స్వాధీన పర్చుకుని ద్విచక్ర వాహనాలను పోలీసులకు అప్పగించారు. వారి వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

108లో ప్రసవం

చింతలమానేపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోర్సిని గ్రామానికి చెందిన కడిపే పుష్పలత 108లో ప్రసవించిది. పుష్పలత బుధవారం రాత్రి పురిటి నొప్పులతో బాధపడుతుండగా 108కు సమాచారం అందించారు. 108 సిబ్బంది గ్రామానికి చేరుకుని పుష్పలతను సమీప ఆసుపత్రికి చేర్చేందుకు వెళ్తుండగా మార్గ మధ్యలో పురిటి నొప్పులు అధికమయ్యాయి. 108లో సిబ్బంది ఈఎంటీ సాగర్, పైలట్ సునీల్ పురిటి నొప్పులతో బాధపడుతున్న పుష్పలతను క్షేమంగా డెలవరీ చేసి సమీప ఆసుపత్రిలో చేర్పించారు. దీంతో తల్లిబిడ్డ క్షేమంగా ఉన్నట్లు ఈఎంటీ సాగర్, పైలట్ సునీల్ తెలిపారు.

గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలి

జైనూర్, అక్టోబరు 16,(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న పోషణ మాసం కార్యక్రమాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని జైనూర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కుడిమెత విశ్వనాథ్‌రావ్ అన్నారు. స్థానిక మార్కెట్ కమిటీ యార్డులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో సీఐ రమేశ్, ఐసీడీఎస్ జైనూర్ ప్రాజెక్ట్ సీడీపీవో ఇందిర, , వైద్యాధికారి అశోక్, మాజీ వైస్ ఎంపీపీ చిర్లే లక్ష్మణ్, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు.

ఐటీడీఏ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని గురువారం స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సవ్యసాచి ఘోష్‌కు ఎమ్మెల్యే కోవ లక్ష్మి హైదరాబాద్‌లో వినతి పత్రం అందజేశారు. చర్యలు తీసుకోవాలని కోరారు.

చెత్తాచెదారం తొలగించాలి

కెరమెరి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఎప్పటికప్పుడు చెత్తాచెదారం తొలగించాలని ఎంపీడీవో అంజద్‌పాషా అన్నారు. మండల కేంద్రంలో గురువారం కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఎంపడీవో మాట్లాడారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణాల క్యాప్చరింగ్ చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏ పీ వో మల్లయ్య, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

దండారి సంబరాలు ప్రారంభం



నృత్యం చేస్తున్న ఆదివాసీలు

సిర్పూర్(యు), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ గ్రామాల్లో దండారి(ఎత్మసార్ దైవం)సంబరాలు ప్రారంభమయ్యాయి. ఆదివాసీ గూడేలలో ప్రస్తుతం ఎక్కడ చూసినా గుస్సాడి నృత్యాలు, డప్పుల మోతలు వినిపిస్తున్నాయి. ఆదివాసీలు నిర్వహించే దండారి ఉత్సవాలకు ప్రత్యేకత ఉంది. దీపావళి పండుగకు నాలుగైదు రోజుల ముందు ముఖ్యంగ దండారి దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాలు ప్రారంబించడం ఆదివాసీల ఆనవాయితీ. పండుగ అనంతరం నిర్వహించే కోలబోడి పండుగతో ముగుస్తాయి. మండలంలోని ఖాతీగూడ, పూల్లర, పంగడి, నేట్నూర్, పాములవాడ, శెట్టిహాడ్పూర్, కోహినూర్, పిట్టగూడ, రాఘాపూర్, బండేయేర్, మూంజీగూడ, సీతాగోంది, ధనోర, పెద్ద దోబ తదితర ఆదివాసీ గ్రామలలో దండారి వేడుకలు కొనసాగుతున్నాయి. ఉమ్మడి జిల్లా ఆదివాసీ గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొని ఉంది. గురువారం పూల్లర గ్రామానికి చెందిన దండారి మండల కేంద్రంలోని ప్రెసిడేంట్‌గూడలో గల సిర్పూర్‌కర్ ఆత్రం వంశీయుల పెద్ద దేవుడి దర్శనం కోసం చేరుకున్నారు. ఆదివాసీలు తమ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు పాటుపడుతారని కొనియాడారు. ఈ సందర్భంగా జైనూర్ సీఐ రమేశ్, జైనూర్ మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఆత్రం భగవంత్‌రావు, సిర్పూర్(యు) ఎస్సై రామకృష్ణ, నాయకుడు తోడసం ధర్మరావు దండారి దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఆదివాసీల గుస్సాడి నృత్యాలను తిలకించారు. మహిళలు, పురుషులు గుస్సా డీ నృత్యం చేస్తూ అలరించారు. కార్యక్రమంలో సిర్పూర్‌కర్ ఆత్రం వంశీయుల లింబారావు కటోద(కులగురువు), గ్రామ పటేళ్లు దుర్వా మోతిరాం, ఆత్రం ఆనంద్‌రావు, ఆత్రం నేహ్రూ, ఆత్రం జ్యోతిరాం, ఆత్రం మానిక్‌రావు, ఆత్రం కర్ణు పాల్గొన్నారు.

గ్రూప్-2 కొలువు సాధించిన యువకుడికి సన్మానం



ఉద్యోగం సాధించిన భాస్కర్‌ను సన్మానిస్తున్న జీఎం విజయభాస్కర్‌రెడ్డి

రెబ్బెన, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగం చేస్తూ పట్టుదలతో గ్రూప్-2 కొలువు సాధించిన యువకుడిని జీఎం విజయభాస్కర్ రెడ్డి గురువారం గోలేటి జీఎం కార్యాలయం ఆవరణలో సన్మానించారు. ఏరియా స్టోర్స్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న భాస్కర్ ఉప తహసీల్దార్‌గా కొలువు సాధించాడు. సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రంథాలయంలో రాత్రి పూట, సెలవు రోజుల్లో పట్టుదలతో చదివి గ్రూప్-2 సాధించినందు జీఎం శాలువాతో సత్కరించి అభినందించారు. గోలేటిలో సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రంథాలయాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఓటుజీఎం రాజమల్లు, ఏరియా ఇంజనీర్ కృష్ణమూర్తి, డీజీఎం ఉజ్వల్‌కుమార్ బెహెరా, ఎస్ఈ జ్ఞానేశ్వర్, ఫైనాన్స్ మేనేజర్ రవికుమార్, సీహెచ్‌పీ ఇన్‌చార్జి కోటయ్య, హెచ్‌ఓడీ శ్రీనివాస్, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

రెబ్బెన, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏఐరయా సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో గోలేటి టౌన్ షిప్‌లోని సీఈఆర్ క్లబ్‌లో గురువారం నిర్వహించిన ఆయుర్వేద వైద్య శిబిరానికి స్పందన లభించింది. మాతా రీసెర్చ్ సెంటర్ డాక్టర్ విశ్వనాథ మహర్షి ఉద్యోగులను, గ్రామస్థులను పరీక్షించారు. దీర్ఘకాలిక వ్యాధులైన కీళ్ల, మోకాళ్ల నొప్పులు, బీపీ, షుగర్, పక్షవాతం వ్యాధులకు మందులు అందజేశారు.

బీసీ బంద్‌కు సహకరించాలి

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రజలు, అన్ని రాజకీయ పార్టీలు, అన్ని కులాలు శనివారం నిర్వహించే బంద్‌కు సహకరించాలని, జిల్లా బీసీ జేఏసీ ఛైర్మన్ రూప్నర్ రమేష్ అన్నారు. అన్ని రాజకీయ పార్టీలకు, ప్రజాప్రతినిధులకు, వివిధ కుల సంఘాల నాయకులను గురువారం కలిసి మద్దతు కోరారు. అనంతరం బంద్‌కు సహకరించాలని సీఐ బాలాజీ వరప్రసాద్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



అంకుసాపూర్ వాగు దాటుతున్న ఎమ్మెల్సీ దండే విఠల్

కాగజ్‌నగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అంకుసాపూర్ గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. అంకుసాపూర్ గ్రామాన్ని గురువారం ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అంకుసాపూర్ వాగుపై తాత్కాలిక రహదారి ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని పటిష్టం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు పాటుపడాలని సూచించారు.. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యురాలు ఠాక్రేం కమలాబాయి, లక్ష్మణ్, సాంబయ్య, నారాయణ, రాజు, వసంతరావు, మురళి, సోనేరావ పాల్గొన్నారు.

కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి



నినాదాలు చేస్తున్న తుడుందెబ్బ నాయకులు

తిర్యాణి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా గోండు సామాజిక వర్గంపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి వెడ్మ భగవంతరావు అన్నారు. మండల కేంద్రంలోని కుమరం భీం చౌరస్తాలో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలల్లో తాత్కాలిక ప్రతిపాదికన విధులు నిర్వహిస్తున్న 220 మందిని పీవో తొలగించడం హేయమైన చర్య అని అన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా కార్మికులు పని చేస్తున్నా వారి జీతాలు సరైన సమయంలో రాక పోవడం వల్లనే కార్మికులు రోడ్డెక్కారని తెలిపారు. అధికారులు సమస్యలు పరిష్కరించి వారిని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

ఆసిఫాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలని గురువారం జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేశవరావు, శేషగిరిరావు అదనపు కలెక్టర్ డేవిడ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేషన్ దుకాణాల్లో పోర్టబుల్ రిక్వెస్ట్ బియ్యాన్ని అనుమతి ఇవ్వకూడదని అన్నారు. దీని ద్వారా పల్లె ప్రాంతాలలో రేషన్ డీలర్లకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. ఎంఎల్ఎస్ గోదాంల నుంచి రేషన్ బియ్యం ముందుగా పల్లె ప్రాంతాలలో రేషన్ షాపులకు పంపిణీ చేశాకే పట్టణ ప్రాంతాలకు పంపిణీ చేయాలని సూచించారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఆత్మారావు, రవీందర్, పెంటయ్య, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్ డేవిడ్‌కు వినతిపత్రం ఇస్తున్న రేషన్ డీలర్లు

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా



తిర్యాణిలో పశువులకు టీకా వేస్తున్న పశువైద్యాధికారి సాగర్

కౌటాల/తిర్యాణి/కెరమెరి అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పశువులకు గాలికుంటు వ్యా. ది నివారణ టీకాకొనసాగుతుంది. గురువారం నాగెపల్లి గ్రామంలో పశువులకు పశువైద్య సిబ్బంది టీకాలు వేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ అంజలి, సిబ్బంది సందీప్, ఖదీర్, భిక్షపతి, ప్రకాష్, శోభన్ పాల్గొన్నారు. తిర్యాణి మండలం రొంపల్లి గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా 312 పశువులకు టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి సాగర్ తెలిపారు. కార్యక్రమంలో సురేష్, మనోహర్, రాకేష్, సంతోష్ పాల్గొన్నారు. రైతులు తమ పశువులకు టీకా వేయించాలని కెరమెరి పశువైద్యాధికారి సురేష్‌కుమార్ అన్నారు. గోయగాం గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.